01ATP04_01ATP04.qxd 04-04-2026 PM 10:55 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 05 ఏప్రిల్ 2026 పేజీలు : 04

# జగన్‌రెడ్డి ఇప్పటికైనా నీ తీరు మార్చుకో..

– ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన

- అమరావతికి చట్టబద్ధతపై చెన్నేకొత్తపల్లిలో సంబరాలు
- ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా దర్బార్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- అక్కడికక్కడే సమస్యల పరిష్కారం.. అధికారులకు పలు సూచనలు




కేక్ కట్ చేసి టిడిపి నాయకులతోపాటు సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రజాదర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

జగన్ రెడ్డి మావిగన్ అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్న జగన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, ఇప్పటికైనా నీ తీరు మార్చుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమరావతి రాజధానిగా పార్లమెంట్‌లో చట్టబద్ధత లబించిన నేపథ్యంలో చెన్నేకొత్తపల్లిలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతతో పాటు కార్యకర్తలు, సామాన్య ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టపాసుల్ని కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెలే సునీత కేక్ కట్ చేసి నాయకులకు అందజేశారు. జై అమరావతి అంటూ నినాదాలతో హోరెత్తించారు.



సింఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. రాష్ట్రానికి అమరావతిని శాశ్వత రాజధానిగా చేయడం పట్ల గ్రామీణ ప్రాంతాల్లో సైతం హర్షం వ్యక్తమవుతోందన్నారు. గత ఐదేళ్లలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ఒక గందరగోళాన్ని సృష్టించారన్నారు. దీని వలన మన పిల్లలు రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా అయ్యాక ఇకపై భవిష్యత్‌లో ఎప్పుడూ అలాంటి పరిస్థితులు రాకూడదని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపారన్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం లభించడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇది చూసి జగన్మోహన్ రెడ్డి మళ్లీ మావిగన్ అంటూ ఇంకో డ్రామా మొదలు పెట్టారన్నారు. రాజధాని విషయంలో ఇలా వ్యవహరిస్తున్న జగన్ని చూసి అంతా నవ్వుకుంటున్నారని.. ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకుంటే మంచిదన్నారు. లేని పక్షంలో ఈసారి ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే సునీత అన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారంకోసమే ప్రజా దర్బార్ ఎమ్మెల్యే సునీత :**

ప్రజల సమస్యలను పరిష్కరించుట కొరకై ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజా దర్బార్ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇందులో పోలీసు శాఖకు సంబంధించిన అర్జీలు, భూముల వివాదాలు, వాటిని సర్వే చేయాలన్న విజ్ఞప్తులు, పంచాయతీ రాజ్, నీరు, రోడ్ల, విద్యుత్ శాఖకు సంబంధించిన అర్జీలు, ఐసీడీఎస్‌తో పాటు పలు శాఖలకు సంబంధించి అర్జీలు ఇచ్చారు. ప్రతి ఒక్కరితో ఓపిగ్గా మాట్లాడి వారి సమస్యలు విన్నారు. పోలీస్, విద్యుత్, తాగునీరు వంటి వాటి విషయంలో కొన్నింటిని తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. మరికొన్నింటిని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించి అధికారులకు కీలక సూచనలు చేశారు. కరువు పనులకు వచ్చే కూలీలు వడదెబ్బ బారినపడకుండా నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. భూ సమస్యలు పదే పదే రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అనంతరం మండలంలో 10మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలు అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ఈ సాయం చేశారు. మొత్తం రూ.10.12లక్షల సాయం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యం విషయంలో వెంటనే స్పందిస్తున్నారని.. గతంలో ఎప్పుడూ లేని విధంగా సాయం చేస్తున్నారని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, హిందూపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు దండు ఓబులేసు, మండల నాయకులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్, వైసీపీ నేతల తీరుతో ఆపార్టీకి 11 సీట్లు కూడా రావు

- పెనుకొండలో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ - పూల మార్కెట్ ప్రారంభించిన మంత్రి సవిత

**పెనుకొండ ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. శనివారం రూ.40 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఘనగిరి పూల మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ,చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు రూ.6 లక్షలతో పూల మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.50 లక్షలతో శానిటేషన్ సెంటర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే రూ.5 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఇంకా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మడకసిర రోడ్ కు కూడా సెంటర్ లైటింగ్ ను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని, నియోజకవర్గానికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సవిత జగన్‌పై విమర్శలు చేశారు. గంటకో మాట మార్చే వ్యక్తి జగన్ అని,పార్టీ ఉనికికోసమే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని అన్ని పార్టీలూ అమరావతికి మద్దతు పలికినా,వైసీపీ మాత్రమే మద్దతు ఇవ్వలేదని అన్నారు.అమరావతి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురిచేసిన కారణంగా వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో గతంలో వచ్చిన సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా వ్యవహరించే వ్యక్తి జగన్ అని విమర్శించారు.రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు, మండల కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్, అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, సీనియర్ టిడిపి నాయకులు బాబుల్ రెడ్డి, త్రివేంద్రనాయుడు, సోమశేఖర్ నాయుడు, బిజెపి నాయకులు రామ కృష్ణ, జనసేన శ్రీదేవి, కౌన్సిలర్లు గీత హనుమంతు, ఎస్ ఎస్ గిరి టిడిపి నాయకులు సౌకత్, దాదు, అస్లాం భాష, ప్రజలు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి



పూల మార్కెట్ ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

# రాష్ట్ర గవర్నర్ పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తనీయకండి



గవర్నర్ పర్యటనపై విసితో చర్చిస్తున్న కలెక్టర్ ఆనంద్

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. జెఎన్‌టియుఏలో 6వ తేది జరగనున్న స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్‌లు జెఎన్టఇయుఏలో పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్‌రావు, రిజిస్ట్రర్ కృష్ణయ్యలతో గెస్ట్ హౌస్‌తోపాటు ఆడిటోరియంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. త్వరలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**శ్రీ సత్యసాయి జిల్లా, ఏప్రిల్ 04, ప్రభాతవార్త ప్రతినిధి**

వేసవి దృష్ట్యా ఏ గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలు నందు జిల్లాలోని అన్ని మండలాల్లో ఖితాగు నీరుఖి సరఫరా, నీటి సంరక్షణ పనులపై ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న నీటి కుంటలు, చెక్ డ్యామ్‌ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో నీటి సమస్యలపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ఒక్క గ్రామంలో కూడా నీటి సమస్య ఉండకూడదని, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఎక్కడైనా చేతి పంపులు లేదా మోటార్లు మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేయించాలని సూచించారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ నీటి సరఫరాను పర్యవేక్షించాలని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. తాగునీటి పనులకు సంబంధించి నిధుల కొరత లేదని, ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సమత, డిప్యూటీ సీఈఓ సుబ్బయ్య, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డ్వామా పిడి విజయేంద్ర ప్రసాద్,ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, అధికారులు, పాల్గొన్నారు."మన ఊరు మన నీరు (జలధార)" శ్రీ సత్యసాయి జిల్లాలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు 100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌ను మిషన్ మోడ్‌లో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యామ్‌లు, ఫార్మ్ పాండ్లు, నీటి బడ్జెట్ వంటి పనులను వేగవంతం చేసి, శాఖల సమన్వయంతో పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. రైతులకు మైక్రో ఇరిగేషన్ ప్రోత్సాహం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

# ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 6వతేదీ చేపట్టనున్న జలధార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే నివాసంలో శనివారం టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గంలోని 4 మండలాలు, మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల తెలుగుదేశం కార్యకర్తలు యాడికి మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు వద్ద ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమావేశానికి హాజరు కావడానికి బస్సులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త ఈ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా, భాధ్యత తీసుకొని కార్యకర్తలను బస్సుల్లో ఎక్కించి సమావేశానికి తీసుకు రావాలని వారు కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, నామినేటెడ్ చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ సమావేశాన్ని దిగ్విజయం చేయాలని వారు తెలియజేశారు.

ఏసీబీ అధికారిగా నటిస్తూ

# తాసిల్దార్‌ను బెదిరించి రూ.50 లక్షలు వసూలు

- ఎస్పీ ప్రత్యేక చొరవతో సిఐ శివరాముడు కృషితో కటకటాల్లోకి నిందితుడు



ఏసిబి అధికారిగా అవతారం ఎత్తిన ఎరికల వెంకటరాముడు

**అనంతపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు 2021 సంవత్సరంలో తనను ఏసీబీ అధికారిగా ఫోన్లో పరి చయం చేసుకుని, ముదిగుబ్బలో తసిల్దార్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను ఫోన్ ద్వారా బెదిరించాడు. అవినీతి కేసులు పెట్టిస్తానని భయపెట్టి రూ.50 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైనా, నిందితుడు తప్పించుకుని తిరుగు తున్నాడు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ కేసును సవాలుగా తీసుకున్న సిఐ శివరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, గోప్య సమాచారంతో నిందితుడి కదలికలను గమనించారు. దీంతో ఏప్రిల్ 4,2026న నిందితుడు ఎరుకల హనుమంతును పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చా యని పోలీసులు తెలిపారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సిఐ శివరాముడు, వారి బృందాన్ని ఉన్నతాధి కారులు అభినందించారు. ప్రజల్లో పోలీసులపై విశ్వా సాన్ని మరింత పెంచేలా ఈ అరెస్ట్ నిలిచిందని పేర్కొన్నారు.



టిడిపి నేతలతో కలిసి ఫోటోలు దిగిన ఎరికల వెంకటరాముడు

# టూర్ డైరీలు ఇవ్వకపోయినా జీతాలు..!

- ప్రతినెల టూర్ డైరీలు ఇవ్వాలని ప్రభుత్వ నిబంధన - గత కొన్ని నెలలుగా టూరు డైరీలు ఇవ్వని వైనం
- కార్యాలయం ఉద్యోగులు అడుగుతున్న పట్టించుకోని వైనం - ఇది అనంతపురం సమగ్రశిక్ష లోని పరిస్థితి

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లా అధికారి నుండి సెక్టోరియల్స్ ,అసిస్టెంట్ సెక్టోరియల్స్ ప్రతినెల టూర్ డైరీలు అందజేసిన తర్వాతనే జీతాలు మంజూరు చేయాలని ప్రభుత్వ నిబంధన ఉంది. కానీ టూర్ డైరీలు అందజేయకపోయినప్పటికీ జీతాలు మంజూరు చేస్తుండటం గమనార్హం. అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టు అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గా జూనియర్ మహిళ ఎంపీడీవో గత ఏడాది జనవరి 17 నుండి పనిచేస్తున్నారు. అదేవిధంగా గత ఏడాది సెప్టెంబర్ లో ఇద్దరు అసిస్టెంట్ సెక్టోరియల్స్, అక్టోబర్ 1 నుండి ఒక సెక్టోరియల్, పలువురు అసిస్టెంట్ సెక్టోరియల్స్ పనిచేస్తున్నారు. అయితే అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ తో పాటు సెక్టోరియల్స్, అసిస్టెంట్ సెక్టోరియల్స్ ప్రతినెల వచ్చే నెలలో ఏ రోజు ఎక్కడికి వెళ్తారని ముందస్తు టూర్ డైరీ లను జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలి. అలాగే ప్రతినెల ఆ నెలలో ఏ రోజు ఎక్కడికి వెళ్లారని టూర్ డైరీ అందజేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఉన్న అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ తో పాటు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్లు జాయిన్ అయినప్పటినుండి ఇప్పటివరకు ముందస్తు టూరు డైరీలు గాని, టూర్ డైరీలు గాని అందజేయలేదని విశ్వసనీయ సమాచారం. ప్రతినెల ముందస్తు టూర్ డైరీలు, టూర్ డైరీలు అందజేయాలని ప్రాజెక్టు కార్యాలయం ఉద్యోగులు అడుగుతున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయంలో ఒక అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్ ఇద్దరు సీనియర్ అసిస్టెంట్ లను దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. ఈ విషయం పైన జిల్లా అధికారులను కలిసి చెబితే పట్టించుకోరనే ఆలోచనతో ఆ ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఇతర ఉద్యోగులతో తమ బాధను చెప్పుకొని తమలో తాము కృంగిపోతు విధులు నిర్వర్తిస్తు న్నారు. అంతేకాకుండా ప్రతినెల టూర్ డైరీలు అందజేస్తేనే వాటి ఆధారంగా జీతాలు చెల్లించాలని ప్రభుత్వ నిబంధన కూడా ఉంది. అయితే ఆ అధికారులు జాయిన్ అయినప్పటి నుండి ఇప్పటివరకు ఏ ఒక్క నెల కూడా టూరు డైరీలు అందజేయకపోయినప్పటికీ ప్రతినెల జీతాలు చెల్లిస్తుండడం విశేషం. ఆ ఉన్నతాధికారికి ఈ విషయం తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయానికి జిల్లా చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ , రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ లు దీనిపైన స్పందించి టూర్ డైరీలు అందజేయని అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా క్యాంపు ల పేర్లతో కార్యాలయానికి సక్రమంగా రాని అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అయితే దీనిపైన ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.




# రాజధానిపై వైసిపి దుష్ప్రచారం విడనాడాలి

-దేశ నేతలతో పాటు ప్రజలు అసహ్యంచుకుంటున్నారు - మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

**అనంతపురం మార్చి04 ప్రభాతవార్త**

రాష్ట్ర రాజధాని అమరావతిపై వైఎస్‌ఆర్‌సిపి దుష్ప్రచారాలను విడనాడాలని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర ప్రజలు అసహ్యంచుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి హితవు పలికారు. శనివారం రాంనగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అమరావతి రైతులు సుధీర్ఘ ఆందోళనలు చేయడంతో పాటు మహిళలు సైతం పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందేనన్నారు. రాజధాని పట్ల హేళన చేయడం మంచిదికాదని, ప్రజలు హర్షించేలా, గర్వపడేలా పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు వచ్చేందుకు సహకరించాలని హితవు పలికారు. రాష్ట్రం విభజన చేస అస్థిపంజరంను చేతికి ఇచ్చినపుడు నారా చంద్రబాబునాయుడు అమరావతి రాజధానిని తీర్మాణం చేస్తే అప్పట్లో వైఎస్‌ఆర్‌సిపి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ప్రతిపక్ష హోదాలో మద్దతు ఇచ్చి అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ ప్రచారం చేస్తూ కాలం వెళ్లబుచ్చిందన్నారు. అమరావతి, పోలవరం నినాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ మేరకు చట్టబద్ధత చేయడం ఎంతో అభినందనీయమని, దీంతో అమరావతితో పాటు రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, దేశంలో అన్ని రాజకీయ పార్టీలు రాజధానికి మద్ధతు తెలియజేస్తుంటే రాష్ట్రంలో మీరెందుకు వ్యతిరేకిస్తున్నారని వైఎస్‌ఆర్‌సిపిని నిలదీశారు. జిల్లాలో కియా సంస్థ టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిందని వేలాది మంది ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారన్నారు. ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకుని రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



చీనీ రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

బి.ఆర్.నాయుడును టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలి

4 >>

02ATP27_02ATP27.qxd 04-04-2026 PM 10:42 Page 1



## ఈ నెల 7 న కంబదూరు మల్లేశ్వర స్వామి రథోత్సవం

కంబదూరు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త



మల్లేశ్వర స్వామి రథం

కంబదూరు మండల కేంద్రంలోని కమల మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 7 వ తేదీన 61 వ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో దేవదాస్, ధర్మకర్త గాజుల హనుమంతరాయుడు శనివారం తెలిపారు .రథోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే జరుగుతున్నాయని వారు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం రథోత్సవంలో భాగంగా మల్లేశ్వర స్వామి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. నేటి నుంచి మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

## మురడి అంజన్నకు భక్తులు ప్రత్యేక పూజలు

డి.హిరెహాళ్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త



నమో ఆంజనేయ అంజనీ పుత్రడ వీరాంజనేయ కాపాడు స్వామి అంటూ భక్తుల నోట ఆంజనేయ స్వామి నామస్మరణం మారుమోగింది. శనివారం డి.హిరెహాళ్ మండలం మురడి గ్రామంకు భక్తులు మూలవిరాట్ ఆంజనేయ స్వామి దర్శనార్థమై తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు రామాంజనేయులు, పవన్ కుమార్‌ల ఆధ్వర్యంలో మూలవిరాట్ ఆంజనేయస్వామి విగ్రహమును వేకువ జామునే శుభ్రపరచి ప్రత్యేకంగ అలంకరించారు. అనంతరం అర్చకులు ముందుగా స్వామివారి కి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి పంచామృతాభిషేకం, ఆకుపూజ, కలశాలంకరణ, విశేషపుష్పాలంకరణ, స్వామివారికి మహా నివేదన, తదితర ఆర్జిత సేవలు పూజలతో పాటు కుంకుమార్చన లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు. ఆంజనేయస్వామి ని దర్శించుకునేందుకు ఉమ్మడి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలతో పాటు మండలంకు సరిహద్దున ఉన్న పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గ తదితర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కుబడులు తీర్చుకొని స్వామివారి సేవలో తరించారు.

## వైసిపీ సీనియర్ నాయకుడు ఆంజనేయులును పరామర్శించిన తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం ఏప్రిల్ 4 ప్రభాతవార్త



సీనియర్ నాయకుడిని పరామర్శిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని చెలిమేపల్లి గ్రామానికి చెందిన సినియర్ వైసిపినాయకుడు తలారి ఆంజనేయులు మోటార్ సైకిల్ నుండి క్రిందపడి కుడి చెయ్యి ఫ్రాక్చర్ అయినందున విషయం తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు కళ్యాణదుర్గ వైసిపీ సమన్వయ కర్త తలారి రంగయ్య చెలిమేపల్లి గ్రామానికి వెళ్లి ఆంజనేయులును పరామర్సించి దైర్యంగా ఉండాలని తెలియ చేసారు ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్. ఎంపీపీ ఖంబం చంద్ర శేఖర్ రెడ్డి మండల వైసిపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన రాజధాని మన అమరావతి

కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 4, ప్రభాత వార్త



అమరావతికి చట్టబద్ధత కల్పించడంతో కేక్ కట్ చేస్తున్న కళాశాల సిబ్బంది

కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో సంబరాలు కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఉన్నత విద్యా శాఖ అధికారుల ఆదేశాల మేరకు మన అమరావతి మన రాజధాని అంశం పార్లమెంట్ లో చట్టబద్ధత చేసిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ , సిబ్బంది విద్యార్థులు కేక్ ను కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హర్ష లత మాట్లాడుతు పార్లమెంటు ఉభయసభల్లో బిల్ కు ఆమోదం తెలపడంతో నూతన రాజధానికి చట్టబద్ధత వచ్చి,మన రాజధాని అమరావతి అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపీడీవో లక్ష్మీనారాయణ



చలివేంద్రం ప్రారంభించిన అధికారులు నాయకులు

బెలుగుప్ప, ఏప్రిల్ 4 ప్రభాత వార్త:

మండల కేంద్రంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వన్నూరుస్వామి కట్టమీద పంచాయతీ కార్యాలయం సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో లక్ష్మీనారాయణ ,టిడిపి నాయకులు మల్లికార్జున, సింగల్ విండ ప్రెసిడెంట్ కంచి రాముడు, బాలాజీ పాల్గొనగా పంచాయతీ కార్యదర్శి మంజునాథ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించడం జరిగింది. నాయకులు మాట్లాడుతూఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చుట కొరకు చలివేంద్ర ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ ఆదేశాలు ప్రకారం ఎంపీడీవో లక్ష్మీనారాయణ బెలుగుప్ప గ్రామ స్పెషల్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టడం జరిగింది. బాధ్యతలు చేపట్టిన స్పెషల్ ఆఫీసర్‌కి టిడిపి నాయకులు మల్లికార్జున, కంచి రాముడు , బాలాజీ పంచాయతీ కార్యదర్శి మంజు పూలమాలవేసి శాలువ తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బైనే నారాయణస్వామి, వన్నూరు స్వామి, స్వచ్ఛభారత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టి.టి.డి పవిత్రతను కాపాడండి వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

హిందూపురం ఏప్రిల్ 4 ప్రభాతవార్త



పూజలు నిర్వహిస్తున్న దీపికా వేణురెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్ బి ఆర్ నాయుడు ను ఆ పదవి నుంచి తొలగించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లో హిందూపురంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం పట్టణంలోని మెయిన్ బజార్లో శ్రీ పేట వెంకటరమణ స్వామి దేవాలయంలో వైసీపీ అసెంబ్లీ ఇన్చార్జ్ దీపిక వేణు రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి బిఆర్ నాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలని దేవున్ని కోరినట్లు చెప్పారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ టిటిడి పవిత్రతకు చేటు తెచ్చిన అతన్ని వెంటనే తొలగించకుండా సీఎం చంద్రబాబు వెనకేసుకు రావడం శోచనీయమని విమర్శించారు. హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసిన అతన్ని ఇప్పటికైనా తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మధుమతి రెడ్డి, బాలాజీ మనోహర్, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

డి.హిరేహాళ్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త

రోడ్డుప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతు కె. విరుపాక్షప్ప శనివారం మృతి చెందినట్లు ఎస్.ఐ. గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సండూర్ తాలూక సుల్తానాపుర గ్రామానికి చెందిన మృతుడు లేబర్ కాంట్రాక్టర్‌గా పని చేసే వారిని ఎస్ఐచెప్పారు. గతనెల మార్చి29న మృతుడు తనచిన్నా న్నదమ్మో రప్పతో కలిసి మండల కేంద్రమైన డి.హిరేహాళ్ లో జరిగిన బంధువుల పెళ్లికి హాజరై తిరుగు ప్రయాణంలో తన మోటార్ సైకిల్ పై స్వగ్రామానికి వెళ్తుండగ ప్రమాదం సంభవించిందని ఎస్ ఐ తెలిపారు. డి.హిరేహాళ్ గ్రామ శివారులో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో మృతుడి తలకు బలమైన గాయంకాగ చికిత్స నిమిత్తం బంధువులు బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారన్నారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతు శుక్రవారం రాత్రి పొద్దుపోయాక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని ఆయన చెప్పారు. ఈ సంఘటనలో స్వల్ప గాయాలతో బయట పడ్డ మరో వ్యక్తి ఆరోగ్యంగ ఉన్నారని ఎస్సై చెప్పారు. మృతుడి కుమారుడు పవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగిందని ఎస్ ఐ తెలిపారు.

## కరణం చిక్కప్ప పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 4, ప్రభాత వార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భాను

కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథి గా జూనియర్ సివిల్‌న్యాయమూర్తి భాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యా మందిరాలలో విలువలతో కూడిన విద్య అందిస్తున్నాయని అటువంటి విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగడానికి న్యాయ విజ్ఞానం ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయసు నుంచి చట్టం పట్ల అవగాహన పెంచుకోవాల న్నారు. సమస్యలు పరిష్కారానికి న్యాయ సలహాలు తీసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ వ్యక్తిగత శుభ్రత, పరిసరాలపరిశుభ్రతను విద్యార్థులు అల్వార్చుకోవాలన్నారు. పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని పౌర విధులు పాటించాలని మీరు పెరిగి పెద్దవారి మీ వృత్తుల ద్వారా సమాజానికి సేవ చేయాలని చెప్పారు. పరస్పర సహకార గుణం మన స్వభావం కావాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు, త్రివిక్రమ్,బాల అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, సీనియర్ న్యాయవాదులు దాదాకలందర్, రామాంజనేయులు, ఎంపీడీవో ధనుంజయనాథ్, దిలీప్, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీటీడీ ఛైర్మన్ పదవి నుండి బిఆర్‌నాయుడును తొలగించాలి

వైసిపి జిల్లా అధికార ప్రతినిధి వీరన్న

బెలుగుప్ప, ఏప్రిల్ 4 ప్రభాత వార్త:



ర్యాలీగాపోతున్న వైసిపి నాయకులు



శ్రీ వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

తిరుమల పవిత్రతను కాపాడాలని, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న బి.ఆర్. నాయుడుని వెంటనే టీటీడీ ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ, వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి నాయకులు బెలుగుప్ప గ్రామంలో శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్య క్రమం నిర్వహించారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి వీరన్న ఆధ్వర్యంలో మండల నాయకులు పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పూజ కార్యక్రమాలు నిర్వహించి, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య,కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైఉన్న తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యతఅని, పవిత్రమైన తిరుమల టీటీడీ ఛైర్మన్ పదవిలో బి.ఆర్. నాయుడు వంటి వ్యక్తులు వల్ల ఆలయ ప్రతిష్టకు భంగం కలిగే ప్రమాదం ఉందనీ, వెంటనే ఆ పదవి నుండి తొలగించి, తిరుమల పవిత్రతను కాపాడాలని, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న బిఆర్ నాయుడు ఎందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలగించ లేదని ప్రశ్నించారు, బి ఆర్ నాయుడు ని పదవి నుండి తొలగించేంతవరకు వైసీపీ పార్టీ పార్టీ ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తిమ్మారెడ్డి కరుణాకర, బాబు రెడ్డి, గురుమూర్తి రెడ్డి, ఎన్ఎస్ శ్రీనివాస్ నాయక్, పాండు నాయక, సుంకా నాయక్, బొడ్డు నాయక్, సంతోష్ నాయక్, అశోక్ నాయక్, రామచంద్రనాయక్, లక్ష్మ నాయక్, రామాంజనేయులు నాయక్, గోవింద నాయక్, బాబు నాయక్, సోమశేఖర్ నాయక్, దేవేందర్ నాయక్, శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా లేకపోయినా ప్రజాసేవకే అంకితం

-తాజా మాజీ సర్పంచు అశ్వర్థనారాయణ



తాజా మాజీ సర్పంచు, వార్డు మెంబర్లను సన్మానించిన దృశ్యం

లేపాక్షి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని పులమతి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదేళ్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా తాజా మాజీ సర్పంచు అశ్వర్థనారాయణ, వార్డు సభ్యులకు శనివారం ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుతో పాటు వార్డు సభ్యులను గ్రామస్తులు, అధికారులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచు అశ్వర్థనారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్ల క్రితం తనపై నమ్మకం ఉంచి అఖండ విజయాన్ని అందించిన పులమతి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీస్సుల వల్లే తనకు గ్రామ సేవ చేసే భాగ్యం కలిగిందని పేర్కొన్నారు. ఇప్పుడు పదవీకాలం ముగిసినప్పటికీ, సామాన్య పౌరుడిగా గ్రామ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటునందిస్తానని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. తన పదవీకాలంలో అండగా నిలిచిన అధికారులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు, నిత్యావసరాలు సక్రమంగా అందేలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అశ్వర్థనారాయణ పేర్కొన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం లభించే వరకు ప్రజల పక్షాన నిలబడతానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టీటీడి చైర్మన్ బిఆర్ నాయుడును పదవి నుండి తొలగించాలి

- కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు
- నడి రోడ్డుపై మహిళను కొట్టినా పవన్‌కళ్యాణ్‌కు పట్టదా
- వైఎస్ఆర్‌సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి


గుంతకల్లు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త



మీడియాతో మాట్లాడుతున్న నైరుతిరెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బిఆర్ నాయుడును పదవి నుండి తొలగించాలని వైఎస్ఆర్‌సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైరుతిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన తిరుమలకు కలంకం తెచ్చిన బిఆర్ నాయుడు ఇంకా పదవిలో కొనసాగుతుండటం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆయనను వెంటనే పదవి నుండి తొలగించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందన్నారు. పట్టపగలు ఓ మహిళను జనసేన పార్టీ నాయకులు నడిరోడ్డుపై కట్టేసి కొడుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయిందన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళను మోసం చేసినా పవన్‌కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వాన్ని విమర్శించిన పవన్‌కళ్యాణ్ నేడు అరాచకాలకు ఎలా మద్దతు పలుకుతున్నారన్నారు. వైకాపా పాలనలో మహిళలకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేయకపోగా అరాచకమైన పాలనను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

## ఎస్సై నాగ మధుని అభినందించిన ఆలయ సభ్యులు



ఎస్‌ఐని సన్మానిస్తున్న ఆలయ సభ్యులు

కనేకల్లు ఏప్రిల్ 04 ప్రభాత వార్త

కనేకల్ ఆరాధ్య దైవమైన శ్రీ చికనేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంపై ఎస్సై నాగ మధుని పోలీస్ స్టేషన్లో శనివారం ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. రథోత్సవంటనే మండల వ్యాప్తంగా లక్షలు జనాలు భక్తులు వస్తూ ఉంటారు వివిధ సంఘటనలు దొంగతనాలు జరిగే అవకాశం ఉందంటూనా పోలీసులు వాళ్ళని ఆశ్రయించడంతో ఎస్సై నాగ మధు సిబ్బందితోపాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితిని రికార్డ్ చేసి ఎప్పుడెప్పుడు గమనిస్తున్నారు. రథోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో సన్మానించామని సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు ప్రసాద్ రెడ్డి వన్నూరు స్వామి నాగరాజు డిష్ కుమార్ ముక్కన్న నాగరాజు పురుషోత్తం కుమార్ పాల్గొన్నారు

## కోరేవాండ్లపల్లి స్కూల్లో...అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




మహిళా దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

గోరంట్ల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మహిళా ఉపాధ్యాయులను డిప్యూటీ డివైఈఓ జాన్‌రెడ్డప్ప మెమొంటోలతో సత్కరిస్తూ అభినందించారు. నేషనల్ సైన్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవిలత, తనుజ్‌కుమార్, భాస్కర్, విక్రం, కృష్ణవేణి, రత్నమ్మ, సాయి సుధామణి, ఫరీదాబేగం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## కోరం లేక వాయిదాపడ్డ మండల సర్వసభ్య సమావేశం

-సోమవారం నిర్వహిస్తామన్న ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్



అధికారులు, ప్రజా ప్రతినిధులు నామమాత్రంగా హాజరు కావడంతో వెలవెలబోతున్న మండల సర్వసభ్య సమావేశం దృశ్యం

ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

ఉరవకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్యసమావేశం కోరంలేక వాయిదాపడింది. శనివారం స్థానికఎంపీడీవోకార్యాలయంలో సమావేశం జరుగాల్సి ఉండగా ఎంపీపీ ఎం.నరసింహులుతోపాటు మరో ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే మండలపరిషత్ కార్యాలయంకు వచ్చారు. సమావేశం జరుగాలంటే ఎంపీటీసీ సంఖ్యలో మూడవ వంతు కనీసం 7 మంది ఎంపీటీలు అవసరం కాగా అటు ఎంపీపీతోపాటు ఇటు మండల పరిషత్ అధికారులు పలువురు ఎంపీటీసీలకు ఫోన్ చేసి సమావేశానికి రావాలని కోరినా స్పందన లేకపోయింది. దీంతో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్ సమావేశాన్ని ఈనెల 6వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించాలని నిర్ణయించారు. కాగా సమావేశానికి అటు ఎంపీటీలతోపాటు ఇటు అధికారులు కూడా నామమాత్రంగానే హాజరు కావడం విశేషంగా చెప్పాలి.

## కంబదూరులో పోలీసుల వజ్ర ప్రహార్ కార్డెన్ సెర్చ్

కంబదూరు ,ఏప్రిల్ 4, ప్రభాతవార్త



పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

వజ్ర ప్రహార్ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంబదూరు మండల కేంద్రంలో సీఐ నీలకంటేశ్వర , ఎస్ఐ లోకేష్ సిబ్బందితో కలిసి శనివారం పలు కాలనీల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ బృందాలు అనుమానిత ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలు , టాటా ఏసీ వాహనాన్ని సీజ్ చేసి ,జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. గుండ్లపల్లి లోని ఓ దుకాణంలో 25 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పోలీసులుహెచ్చరించారు.ఈ కార్యక్రమం లో శెట్టూరు, కుందుర్పి,బ్రహ్మసముద్రం ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, గంటా నరహరి



వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్న దృశ్యం

గుత్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని విరూపాక్షిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన వివాహ వేడుకకు ప్రముఖులు హాజరయ్యారు. మండలంలోని తురకపల్లి గ్రామానికిచెందిన రామిరెడ్డి కుమారుని వివాహానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా నరహరి, మాజీసర్పంచు హుస్సేన్‌పీరాతోపాటుగా పలువురుప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడును తొలగించండి

తిరుపతి పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వందే.

పెనుకొండ ఏప్రిల్ 4 ప్రభాతవార్త



ఆంజనేయస్వామి పూజలు చేస్తున్న వైసీపీ నాయకులు

టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు ను తొలగించి తిరుపతి పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ పుప్పం సుధాకర్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఊరి వాకిలి ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు మంచిబుద్ధి ప్రసాదించి టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు ను ఛైర్మన్ పదవి నుంచితొలగించి తిరుపతిపవిత్రతను కాపాడేవిధంగా చేయాలని ఆంజనేయ స్వామికి మొక్కుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు పవిత్రమైన టిటిడిఛైర్మన్‌గా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఆయన వ్యవహారాలు ఎన్ని సోషల్ మీడియాలో ప్రజలుచూస్తూ విస్తుపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, మాజీ మండల కన్వీనర్ నాగలూర్ బాబు, మాజీ సింగిల్ విండో ఛైర్పర్సన్ ప్రకాష్ రెడ్డి,మాజీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల వైస్ కన్వీనర్ కురుబవాండ్లపల్లి చెన్నకేసులు నియోజకవర్గం ఇంటలెక్చువల్ అధ్యక్షులు కొండపల్లి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజు, కౌన్సిలర్ సద్దాం, మండల యూత్ ప్రెసిడెంట్ చేన్నంరెడ్డి నాగిరెడ్డి, హనుమంతరెడ్డి, అనిల్, లక్ష్మీ నాయక్, సంతోష్ రెడ్డి, విజయ్ కుమార్, శెట్టిపల్లి అస్వర్థనారాయణరెడ్డి, మునిమడుగు కిష్ట, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల తనిఖీ

పరిగి ఏప్రిల్ 4(ప్రభాత వార్త:



తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యసాయి జిల్లా పరిగి మండలకేంద్రంలోని ప్రధానరహదారి పై జిల్లా ఎస్ పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పరిగి ఎస్ ఐ రంగడు యాదవ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ద్విచక్ర వాహనాలను తనిఖీ నిర్వహించారు తనిఖీలో భాగంగా వాహనదారుల హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,తదితరాలపైన తనిఖీ నిర్వహించి జరిమానాలు విధించారు కార్యక్రమంలో పరిగి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

03ATP04_03ATP04.qxd 04-04-2026 PM 10:41 Page 1



## నియోజకవర్గ అభివృద్ధి పై పక్కా ప్రణాళిక

**శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



సమావేశానికి హాజరైన అధికారులు టిడిపి నాయకులు

**శింగనమల ఏప్రిల్ 04 ప్రభాతవార్త**

నియోజకవర్గ 2026-27 బడ్జెట్ పై సమీక్ష సమావేశం శనివారం మండల కేంద్రంలోని యంపిడిఓ కార్యాలయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ. ఆర్డిఓ కేశవ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులు పక్కా ప్రణాళిక కలిగి ఉండాలని. వేసవి కాలం ప్రారంభమైనందున బడ్జెట్లో త్రాగునీరు సాగునీరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గ్రామాలలో రోడ్ల నిర్మాణం పక్కా గృహాల నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటివరకు అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి జాబితా తయారు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధిలో కూడా ముందుకు వెళ్తున్నాం అన్నారు. నియోజకవర్గ బడ్జెట్ ప్రతిపాదనలు ప్రజలకు అనుకూలంగా ఉపయోగపడేలా చూడాలన్నారు. అనంతరం ఆర్డీఓ కేశవ నాయుడు మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు ఎక్కువ ఉన్నందున వారు పండించిన పంట ఎగుమతికి అవకాశం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాలలో పాడి పశువులు పెంపకానికి అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్. హౌసింగ్ డిఈ రామ్మూర్తి. పంచాయతీరాజ్ డిఈ కృష్ణ జ్యోతి. ఐసిడిఎస్ సిడిపిఓ చల్లా లలిత. డిప్యూటీ తాసిల్దార్ సూర్య ప్రతాప్ యాదవ్. డిప్యూటీ ఎంపీడీఓలు విజయ్ కుమార్. అక్బర్. టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి. రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం ఆదినారాయణ. సింగిల్ విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ. ఆయకట్టు చైర్మన్ బోయ సత్యనారాయణ. మాసూలు చంద్రమోహన్. సి వెంకటేశు, మాజీ సర్పంచులు రాజు. రమేష్. మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ భాస్కర్



శింగనమల ప్రత్యేకఅధికారి భాస్కర్ ను సన్మానిస్తున్న గ్రామస్తులు

**శింగనమల ఏప్రిల్ 04 ప్రభాతవార్త**

గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసినందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శింగనమల గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ భాస్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సి వెంకటేశు. మాసూలు చంద్రమోహన్. పంచాయతీ కార్యదర్శి తిప్పే స్వామి. ఏఎన్ఎం. నరేష్ తదితరులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే కఠిన చర్యలు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



వాహనాలు ఆపి తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని లేకుంటే అలాంటి వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలను అరికట్టడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగం, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం వంటి అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

## రైల్వే స్టేషన్ ప్రాంతంలో తనిఖీలు



రైల్వే స్టేషన్ ఆవరణంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు

**అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం త్రీ టౌన్ సి.ఐ. రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో విస్తృత స్థాయి తనిఖీలు చేపట్టారు. పోలీసు సిబ్బంది రైల్వే స్టేషన్, చుట్టుపక్కల ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారి వివరాలను సేకరించారు. సరైన ఆధారాలు లేని వ్యక్తులను ప్రశ్నించి, వారి గమ్యస్థానాలు, ప్రయాణ ఉద్దేశ్యాలపై విచారణ నిర్వహించారు. వారి సామాన్లను కూడా తనిఖీ చేశారు. ప్రజల భద్రతపై నిఘా ఉంచామని సి.ఐ తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు లేదా వస్తువులు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమని తెలిపారు.

## తెలుగు పద్య వైశిష్టంపై సాహిత్యోపన్యాసం

**అనంతపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త బ్యూరో**

తెలుగు సాహిత్యంలో తనదైన స్థానం నిలుపుకొన్న పద్యప్రక్రియ విశిష్టతపై ప్రముఖ అవధానకవి, హంస పురస్కార గ్రహీత డా.నరాల రామారెడ్డి ఉపన్యాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేమన పౌండేషన్ కార్యదర్శి డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. 5వ తేదిన, ఆదివారం, ఉదయం 930 గంటలకు అనంతపురము లోని ఎస్.ఎస్.బి.ఎన్ కాలేజ్ క్యాంపస్, వేమన కేంద్రంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. విశ్రాంత వైస్ ఛాన్సలర్ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి.. అతిథిగా విచ్చేయనున్న ఈ కార్యక్రమంలో తెలుగు పద్య, భాషాభిమానులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమ వివరాలకోసం 9963917187 నెంబరును సంప్రదించాలన్నారు.

## నగరంలో రన్ ఫర్ జీసెస్ ర్యాలీ



నగరంలో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసెస్ ర్యాలీ

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలో పెద్ద ఎత్తున పాస్టర్ అసోషియేషన్లతోపాటు క్రిస్టియన్లు పెద్ద ఎత్తున రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ.. గుడ్ ఫ్రైడే రోజున యేసు సిలువ వేయబడి 3వ రోజుని, మృత్యుంజయుడై తిరిగి లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యేసు ప్రభు ప్రేమ, త్యాగం, కరుణ గురించి వివరిస్తూ రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రన్ ఫర్ జీసస్ కమిటీ గౌరవ అధ్యక్షులు బెన్ హర్, చైర్మన్ సంపత్, కో అడినేటర్ మోసెస్, చీఫ్ కన్వీనర్ కాంతి జాన్ వెస్లీ, కన్వీనర్ స్వామిదాస్, పొలిటికల్ కన్వీనర్ వైఎస్ఆర్సిపి క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు జానీ,కో కన్వీనర్ థామస్,కొఠారి విక్టర్ డేనియల్,ఎన్. కమల్, విల్సన్, జిల్లా అధ్యక్షులు వైఎస ఆర్సిపి బాబు, పాస్టర్లు లింగాల రమేష్, మనశే, ఆదినారాయణ పాల్గొన్నారు.

## నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్టోలో శ్రీ చైతన్య విద్యార్థినికి మొదటి బహుమతి



విద్యార్థినిని అభినందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థిని అమెరికా వారిచే నిర్వహిస్తున్న నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్లో మొదటి బహుమతిని గెలుచుకొని సత్తా చాటిందని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఉమ్మడి అనంతపురం జిల్లా ఏజీఎం సుబ్బారెడ్డి తెలియజేశారు. డిసెంబర్ నెలలో నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్కు సంబంధించినటువంటి ప్రాజెక్టును తయారుచేసి పంపగా అందులో స్పేస్‌కు సంబంధించినటువంటి " వేర్ ద స్కై కర్వ్స్ ఇన్ వర్డ్ " అనే పద్యానికిగాను ఈ విద్యార్థినికి మొదటి బహుమతి లభించిందని అన్నారు. అనంతపురం జిల్లా లాంటి కరువు ప్రాంతం నుండి ఇలాంటి మట్టిలో మాణిక్యాలను తయారు చేయడం శ్రీ చైతన్య విద్యాసంస్థలకు వెన్నతో పెట్టిన విద్య అని, ఇటువంటి మరెన్నో విజయాలు విద్యార్థి సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులను, నాసా ఇన్చార్జ్ ఉపాధ్యాయుడు విద్యాసాగర్‌ను, ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధా కృష్ణ, డీన్స్ భవిత, చెన్న కృష్ణారెడ్డి, నాసా ఇంచార్జ్ విద్యాసాగర్, ఒలంపి యాడ్ ఇంచార్జ్ చంద్రలేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగిలి గొర్రెలు మృతి



వడదెబ్బ తగిలి మృతి చెందిన గొర్రెలు

**శింగనమల ఏప్రిల్ 04 ప్రభాతవార్త**

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామానికి చెందిన జనగాని శివ గొర్ల మందలో శనివారం ఎండ తీవ్రతకు వడదెబ్బ తగిలి 15 గొర్రెలు మృతి చెందినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. మరిన్ని గొర్రెలకు తీవ్ర అస్వస్థత నెలకొని ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం సరస్వతీపూజ, పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం పట్ల కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు రవిమోహన్, నిర్మలానందరెడ్డి, ఎంఇఒ-1 నాగరాజు, ఎంఇఒ-2 రామగోవిందురెడ్డి, హైస్కూల్ హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు సరస్వతి, ఇందుమతి, ఉమామహేశ్వరి, బేబి, తదితరులు పాల్గొన్నారు.

## తారురోడ్డు నిర్మించాలని మంత్రికి వినతి

**పుట్లూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం కడవకల్లు నుండి దోసలేడు, ఓబులాపురం గ్రామాలకు తారురోడ్డు నిర్మించాలని టిడిపి పుట్లూరు మండల కన్వీనర్ గుత్తా శ్రీనివాసనాయుడు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి జనార్ధన్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. అలాగే మండలంలోని పలు రహదారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు మండల కన్వీనర్ తెలిపారు.



← మంత్రికి వినతిపత్రం అందచేసిన శ్రీనివాసనాయుడు

## అనంత విద్యార్థికి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి

**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ బహుమతి లభించడం అభినందనీయం**

**- కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మార్కండేయులు సూరి**





ద్వితియ బహుమతి అందుకుంటున్న కేంద్రీయ విద్యాలయ విధ్యార్థిని నవనీ

**అనంతపురం వైద్యం ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



విద్యార్థులకు అభినందిస్తున్న దృశ్యం

కేంద్రీయ విద్యాలయ నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎ.స్ నవనికి జాతీయస్థాయి లో ద్వితీయ బహుమతి అందుకుంది .ఈ సంధర్భంగా స్కూల్ అసెంబ్లీ లో ప్రత్యేకంగా అభినందించారు. జూనియర్ రెడ్ క్రాస్ ఇంటర్ స్టేట్ స్టడీ కం ట్రెనింగ్ కార్యక్రమం మార్చి 25 నుండి మార్చి 29 వరకు ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ నందు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో లో భాగంగా ఎగ్జిబిషన్ కాంపిటేషన్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండవ బహుమతిని చిన్నారి నవని అందుకోవడం జరిగింది. జూనియర్ రెడ్ క్రాస్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎగ్జిబిషన్ ఫోటోల ప్రదర్శనకు చిన్నారి నవని కు రెండవ బహుమతి లభించినందుకు జూనియర్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం బ్రాంచ్ వాలంటరీ సభ్యురాలు అయిన ఎస్ నవని మా స్కూల్ విద్యార్థి కావడం మాకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జూనియర్ రెడ్ క్రాస్ ఇంటర్ స్టేట్ స్టడీ కం ట్రైమింగ్ కార్యక్రమంలో ఐదు రాష్ట్రాల జూనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొని ఫస్ట్ ఎయిడ్ ట్రెనింగ్ మరియు స్వచ్ఛభారత్, డ్రగ్ ఫ్రీ ఇండియా, వ్యక్తిగత పరిశుభ్రత లాంటి అంశాలపై అవగాహన విద్యార్థుల్లో కల్పిస్తుందనకు జూనియర్ రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ శాఖకు ప్రత్యేకంగా అభినందనలు తెలపారు.

## అంకితభావంతో పనిచేయాలి !

**- ఎంపీడీఓ విజయ లక్ష్మి**

**- స్పెషల్ ఆఫీసర్లతో మండల అభివృద్ధిపై దిశా నిర్దేశం !**



మాట్లాడుతున్న ఎంపిడిఓ విజయలక్ష్మి

**రాప్తాడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీలకు కొత్తగా నియమించబడిన స్పెషల్ ఆఫీసర్స్‌తో, పంచాయతీ అభివృద్ధి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి పనులు, పారిశుధ్యంపై స్పెషల్ ఆఫీసర్లకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో కె.అచ్యుతానంద బాబు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ పి.మల్లికార్జున, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.కృష్ణ చైతన్య, పంచాయితీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా యురోకిడ్స్ ప్రీస్కూల్ మొదటి వార్షికోత్సవం



యూరోకిడ్స్ ప్రీ స్కూల్ మొదటి సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

నగరంలోని హౌసింగ్ బోర్డులో గల యురోకిడ్స్ ప్రీస్కూలులో శనివారం మొదటి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ కె.సురేఖ, కడప రిమ్స్ ఆసుపత్రి డాక్టర్ మహేంద్రనాథ్, కూచిపూడి నాట్యగురువు కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూలు మేనేజింగ్ డైరెక్టర్ దాసరి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. యూరోకిడ్స్ ప్రీస్కూలులో విద్యార్థుల కోసం అన్ని వసతులు కల్పించామన్నారు. ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రుల సహకారంతో స్కూలులో అభి వద్ధి చెందుతోందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు స్వీట్లు అందజేశారు.

## బిఆర్.నాయుడును తొలగించి తిరుమల పవిత్రతను కాపాడాలి

**- వైసిపి మహిళా నేతల నిరసన**



దేవాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి మహిళా నేతలు

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్.నాయుడు పదవి నుంచి తొలగించాలని వైసిపి మహిళా విభాగం నేతలు డిమాండ్ చేశారు. వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో నగరంలోని శ్రీకంఠం సర్కిల్, వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం దేవాలయం బయట టిటిడి చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలను చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. టిటిడి చైర్మన్‌గా బిఆర్.నాయుడు నియమితులైన నాటి నుంచి అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారారన్నారు. మరోవైపు ఇటీవల మహిళతో సన్నిహితంగా ఉన్న వీడియోలు వైరల్‌గా మారాయన్నారు. అయినప్పటికీ అతనిని పదవి నుంచి తొలగించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. టిటిడిలో బిఆర్.నాయుడు కంటే సమర్థులు లేరా అని ఆయన ప్రశ్నించారు. బిఆర్.నాయుడును తొలగించ కుంటే వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాష్ట్ర కార్యదర్శి దేవి, మహిళా నేతలు భూమి రెడ్డి జాహ్నవి, సాకే చంద్రలేఖ, సునీత, రాధయాదవ్, భారతి, అంజలి, శోభ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు అన్యాయం చేయమని జగన్ చెప్పాడా

**- మహిళపై మూడుసార్లు ఓడిపోయిన వ్యక్తి ప్రకాష్ రెడ్డి**

**- నువ్వు ఎలా ఎమ్మెల్యే టికెట్ అడుగుతావు .. పూల కుంట శివారెడ్డి**





సమావేశంలో మాట్లాడుతున్న పూలకుంట శివారెడ్డి.

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 04 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం పనిచేసిన కార్యకర్తలకు అన్యాయం చేయమని పార్టీ అధినేత వైయస్ జగన్ చెప్పాడా అని మాజీ ఎమ్మెల్యే తో పుదుర్తి ప్రకాష్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ అయిన నాయకుడు పూలకుంట శివారెడ్డి ప్రశ్నించారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో పార్టీ నుంచి సస్పెండ్ అయిన రమేష్, రాజా రామ్ తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పార్టీకి చేసిన మంచి చెడుల గురించి తెలపకుండా మాపైన వ్యక్తిగత విమర్శలు చేశారని, నా భుజముపైన వైఎస్ జగన్ చెయ్యి ఉందని చెప్పుకోవడం జరుగుతుంది. వైయస్ జగన్మోహన్ రెడ్డి జై నీ భుజము పైన మాత్రమే ఉంది, రాష్ట్రంలోని కార్యకర్తల అందరి గుండెల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉన్నారని, వైఎస్ జగన్ మామాద్రి నిన్ను పార్టీ నుండి పక్కన పెడితే మీ కుటుంబం మీ సొంత ఊరిలో సర్పంచ్ పదవి కూడా గెలవలేరన్నారు. రాప్తాడు నియోజకవర్గం లో ఒక మహిళ అయినా పరిటాల సునీత చేతిలో ఓడిపోయిన వ్యక్తివి నువ్వు మళ్ళీ ఎమ్మెల్యే టికెట్ ఎలా అడుగుతా వని ప్రశ్నించారు. రాప్తాడు నియోజకవర్గంలో 28 వేల ఓట్లు గా ఉన్న రెడ్లను ఎప్పుడైనా రెడ్డిగా గుర్తించావా, ఒక్క నీ కుటుంబాన్ని తప్ప, వైయస్ రాజశేఖర్ రెడ్డి నా గుండెల్లో ఉంటారంటావు, మరి ఆయన పేరు మీద మీ ఊరిలో ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసావా అన్నారు.ఏ ఎమ్మెల్యే అయినా ఆ నియోజకవర్గంలోని కార్యకర్తలకు మేలు చేసిన వారు ఉంటారు, నువ్వు మాత్రం నీనియోజకవర్గంలోని నాయకులకు కార్యకర్తలకు ద్రోహం చేసి బజార్ణా పడేసావన్నారు. నాయకులు గానీ కార్యకర్తలు ఎవరైనా మీకు డబ్బు ఇచ్చి ఆ డబ్బును ఇవ్వమని అడిగితే ఏమయ్యా మీరు టిడిపితో కలిసి ఉన్నారంట అంటారు. పదవులు ఇప్పిస్తానని ఎంతమందితో డబ్బులు వసూలు చేశారో జిల్లాలోని అందరికీ తెలుసు అన్నారు. నువ్వు మీ కుటుంబం జిల్లాలోని మంత్రులతో సంబంధాలు పెట్టుకుని మీరు చేసిన పనులకు బిల్లులు చేయించుకోవడంతో పాటు మీ పైన ఎటువంటి కేసులు లేకుండా చేసుకుంటున్నారు అన్నారు. 2011 లో నేను బంగారు కొదవ పెట్టి నీ కొడుకు ఫీజు కట్టింది నిజం కాదా అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైయస్ విజయమ్మను తిట్టిన జేసీ కుటుంబాన్ని కలసిన వ్యక్తులు మీరు వైయస్సార్ అభిమానులు ఎలా అవుతారన్నారు. మీలాగా మేము కాదని మా ప్రాణం ఉన్నంతవరకు వైఎస్సార్ సీపీలో ఉంటూనే వైయస్ జగన్మోహన్ రెడ్డికి అండగా ఉంటామన్నారు. త్వరలో జిల్లాలో మీ రు చేసుకున్న లోపాయికారి ఒప్పందాలను బయటపెడతామన్నారు.

## సాయి విజ్ఞాన్ పాఠశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**





బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక 3వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో ఆదివారం సెలవు కారణంగా శనివారమే బాబు జగ్ జీవన్ రామ్ జయంతి సందర్భంగా వ్యాసఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాఠశాల డైరెక్టర్లు ఎం.పి. శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, పాఠశాల ప్రిన్సిపల్ జి.లావణ్య రామ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. భారతదేశ చరిత్రలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకులలో బాబూ జగ్జీవన్ రామ్ ఒక గొప్ప నాయకుడు అని, ఆయనను ప్రజలు ప్రేమగా "బాబుజీ" అని పిలుచుకుంటారు. బాబుజీ 1908 ఏప్రిల్ 5న బీహార్‌లోని భోజ్‌పూర్ జిల్లాలోని చాంద్వా గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయన సామాజిక అసమానతలను చూసి, వాటిని తొలగించాలని నిశ్చయించుకుని, మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. ఆయన దాదాపు 50 ఏళ్లపాటు (1936-1986) నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడిగా పనిచేసి ఒక ప్రపంచ రికార్డు సృష్టించారు. భారత ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా, వ్యవసాయ మంత్రిగా, రక్షణ మంత్రిగా వివిధ కీలక పదవులు నిర్వహించారు. 1971 భారతపాకిస్థాన్ యుద్ధం సమయంలో ఆయన రక్షణ మంత్రిగా వ్యవహరించి కీలక పాత్ర పోషించారు. ఆయన భారతదేశ ఉప ప్రధాన మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన ఆదర్శాలను పాటిస్తూ భారతదేశ ఉన్నతికి తోడ్పడాలని డైరెక్టర్లు, ప్రిన్సిపల్ విద్యార్థినీ విద్యార్థులను కోరారు.

## మామిడి కాయలపై రసాయనాల ముఠా దందా..!

**- పాత కల్లూరు కేంద్రంగా అక్రమ వ్యాపారం..**

**గార్లదిన్నె, ఏప్రిల్ 04, ప్రభాత వార్త**





పచ్చి మామిడిని రసాయనాలతో పండిస్తున్న దృశ్యం

మండలంలోని పాత కల్లూరు ప్రాంతంలో మామిడి కాయలపై ఎథిలిన్ సాచెట్లతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న భారీ అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. వ్యాపారులు రైతులు పండించిన కాయలను మార్కెట్ ధర కంటే తక్కువకు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా మండిలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తూ ప్రభుత్వానికి గండి కొడుతున్నారని సమాచారం. ఇతర జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది వ్యాపారులు మంత్రుల పేర్లను వాడుతూ అక్రమ కార్యకలాపాలను నిర్భయంగా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పచ్చి మామిడి కాయలను బయటకు ఆకర్షణీయమైన పసుపు రంగులోకి మార్చి విక్రయిస్తున్నప్పటికీ, లోపల మాత్రం పండని స్థితిలోనే ఉంటున్నాయి. ఈ రసాయనాలతో పండించిన పండ్లు ఆరోగ్యానికి హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మాగ పెట్టిన మామిడి పండ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ ఈ దందాను విస్తరిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అధికారుల నిర్లక్ష్యం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఈ అక్రమ దందాపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

## నోటిఫికేషన్‌పై సవరణ ఇవ్వండి

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని దివ్యాంగుల ప్రత్యేక ఉద్యోగ నియామకము కొరకు నోటిఫికేషన్ నెంబర్ 1/ఎస్ఆర్డి/ఎటిపి/2026 తేది 31.3.2026న జారీ చేసినట్లు విభిన్న ప్రతిభావంతు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.అర్చన ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో లైబ్రేరియన్ పోస్టు ఓడిఎస్‌సి పరిధిలో ఉన్నదని చూపడం జరిగింది. కానీ లైబ్రేరియన్ పోస్టు డిఎస్సీ పరిధిలోకి వచ్చును. ఇదే విషయము గురించి సవరణను వెబ్‌సైట్‌లో సవివరంగా పొందుపరచడం జరిగింది. కావున ఉమ్మడి అనంతపురం జిల్లాలోని దివ్యాంగులందరూ (బదిరిలు) ఈ విషయాన్ని గమనించి దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు. ఇతర వివరముల కొరకు 08554-232380 టెలిఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# ముగిసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం



చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మ, కిరణ్‌స్వామిలు ఆలూరుకోనలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తీర్థవాది, వసంతోత్సవం, చక్రస్నానము, పుష్పయాగము, తులసిదళాలతో అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పుష్పాలతో అర్చన చేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి హంసవాహనంపై ఆలూరు గ్రామ వీధుల్లో మేళతాళాలనడుమ అంగరంగవైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలూరుకోనలో భక్తులకు నగరూరు వంశీయులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీచైర్మన్ ఒగేటి రంగనాయకులు, ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కాశీ, తదితరులు ఏర్పాట్లు చేపట్టారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# నో పాలిటిక్స్ పంపకాలే మన ట్రిక్స్

**- కుదరని "చెక్కు" కో రూ.30 వేల ఒప్పందం**

**- కాంపౌండ్‌లో కమిషన్ కోసం మిత్రత్వం...చర్చలు విఫలమై వేలంలో శత్రుత్వం**

**-కూరగాయల మార్కెట్ వేలంలో రూ.12 లక్షలకు పైగా పెరిగిన ఆదాయం**

**-రూ.35.33 లక్షలకు వేలం దక్కించుకున్న...ఎంపి పార్థసారథి అనుచరుడు అశ్వర్థరెడ్డి**



వేలంపాట నిర్వహిస్తున్న ఎంపిడిఒ, ఈఓ



వాగ్వివాదం చేసుకుంటున్న ఇరువర్గాలు

**గోరంట్ల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్ ఏడాది పాటు వేలం పాటలో మునుపు ఎన్నడూ లేనంతగా ఏకంగా 12 లక్షల పైగా ఆదాయం పెరిగిన సంఘటన చోటుచేసుకుంది. 2026 ఏప్రిల్ నుంచి 2027 ఏప్రిల్ వరకు 12 నెలల సమయ పరిధికి సంబంధించి శనివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ కమలాబాయి, పంచాయతీ ఈఓ సంజయ్‌నాయక్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. అయితే వేలపాట ప్రారంభం ముందు పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇటు అధికార తెలుగుదేశం పార్టీ అటు ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీలు పక్కనపెట్టి సిండికేట్‌కు ప్రాధాన్యత ఇస్తూ సాగిన రాజీ చర్చలు చూపరులను ముక్కున వేలు వేసుకొని రాజకీయమంటే ఇదేనేమో, కేవలం చిన్నపాటి సిండికేట్ అమౌంట్‌కు బహిరంగంగా బరితెగించి ఒకటి కావడం ఏంటని చర్చించుకుంటున్నారు. ప్రధానంగా ఏడాది పాటు కూరగాయల మార్కెట్ వేలం పాట కోసమై ప్రభుత్వ నిబంధనల ప్రకారం దాదాపు 23 మంది వేలం పాటలో పాల్గొనేందుకు డీడీలు తీశారు. అయితే అందులో 20 మంది అధికారపార్టీ వారు కాక మరో ముగ్గురు ప్రతిపక్ష నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వేలంపాట ప్రారంభంకు ముందు పంచాయతీ కార్యాలయంలో బహిరంగంగానే గ్రూపులు గ్రూపులుగా విడిపోయి డీడీలు తీసిన వ్యక్తులందరూ సిండికేట్‌గా తయారైతే వేలంపాట తక్కువ ధరకు తగ్గించుకున్నామని అందుకుగాను ఒక్కో డిడికి 25 వేల నుండి 30 వేల వరకు సిండికేట్ అమౌంట్ పంచుకునేలా దాదాపుగా ఖరారై ఆఖరి నిమిషంలో చర్చలు విఫలం కావడంతో ఇరు వర్గాలు వేలంపాటకు సిద్ధమయ్యారు. అయితే గంటకు ముందు సిండికేట్ లెక్క కోసం స్నేహభావం చూపించిన వేలంపాటదారులు చర్చలు విఫలమై లోపలికి వెళ్లిన అనంతరం ఒకసారిగా మాది అధికార పార్టీ మీది ప్రతిపక్ష పార్టీ మేము చెప్పిందే జరగాలి అనే తరహాలో వేలంపాట మధ్యలో వాగ్వివాదాలు చేసుకోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆఖరికి వేలంపాటను ఎంపి పార్థసారథి ముఖ్య అనుచరుడు అశ్వర్థరెడ్డి 35.33 లక్షలకు వేలం పాటను దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే తరహా కాలపరిమితికి గాను 23.22 లక్షలకు వేలం పోగా ఈ ఏడాది పెరిగిన వేలంపాటతో పోలిస్తే 12 లక్షలకు పైగాపంచాయతీకి ఆదాయం పెరిగినట్లు అయింది. అయితే వేలంపాట మొత్తాన్ని వారంలోపు వన్ టైం సెటిల్మెంట్ కింద వేలం పాటదారుడు చెల్లించాలని లేనిపక్షంలో ఇప్పుడు ఎక్కువ మొత్తంలో పాడేసి మళ్లీ పంచాయతీ ఆదాయానికి గండి కొట్టేలా కట్టకుండా పోతారని పలువురు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ బోయ శేఖర్, ఎస్ఐ రాము ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

# బీజేపీ జండా కట్టల తొలగింపుపై వివాదం..!

**-ఎక్కడా బీజేపీ జండా ఎగురకూడదా అంటూ సోషల్ మీడియలో పోస్టులు**

**-ఇది ప్రధాని నరేంద్ర మోదీకు జరిగిన అవమానం అంటూ విస్తృత ప్రచారం**



పట్టణంలోని కవితా సర్కిల్‌లో ప్రధాన రోడ్డు పక్కన నిర్మించిన బీజేపీ జండా కట్టను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

**ఉరవకొండ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో బీజేపీ జండా కట్టలపై వివాదం రచ్చకెక్కింది. పట్టణంలోని స్థానిక కవిత హోటల్ సర్కిల్‌లో ప్రధాన రహదారికి పక్కన, బళ్లారి బైపాస్ రోడ్డు పెట్రోల్ బంకువద్ద కొత్తగా నిర్మించిన జండా కట్టలను శనివారం మధ్యాన్నం మేజర్ గ్రామ పంచాయతీ తొలగించడం వివాదానికి కారణమవుతోంది. ప్రతి ఊరిలో బీజేపీ జండా ఎగురాలని, జండాతోపాటు గ్రామంలో మనం చేస్తున్న అభివృద్ధి కళ్లకు కట్టినట్లు చూపించాలన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పిలుపు మేరకు తాము జండా కట్ట కడితే దాన్ని పంచాయతీ అధికారులు తొలగించడం ఏంటని ప్రశ్నిస్తూ బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో జండా కట్ట తొలగింపు వీడియోలను వైరల్ చేస్తున్నారు. ఎక్కడా బీజేపీ జండా కనబడకూడదన్నట్లు ఇక్కడ అధికారులు వ్యవహరిస్తున్నారని ఇది ప్రధాని నరేంద్ర మోదీకు జరిగిన అవమానంగా తాము భావిస్తున్నామని పెడుతున్న పోస్టులు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర, రాష్ట్రాల్లోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని అయితే ఉరవకొండలో బీజేపీ జండా కట్టలను అధికారులు ఎలా తొలగిస్తారని నాయకులు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ పార్టీ భాగస్వామ్యం ఎంతో ఉంది అని చూపించేందుకు మన ఊరు-మన జండా కార్యక్రమంలో భాగంగానే జండా కట్టలు నిర్మించి జండాలను ఎగురవేయాలని చేసే ప్రయత్నాన్ని అడ్డుకొంటున్నారని బీజేపీ నాయకులు వాపోతున్నారు.

**పంచాయతీ పరిపాలన అధికారి వివరణ:**

జండా కట్టల తొలగింపుపై మేజర్ గ్రామ పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మద్ రఫీను 'ప్రభాతవార్త' వివరణ కోరింది. దీంతో ఆయన మాట్లాడుతూ జండా కట్టల ఏర్పాటుపై ఎవరూ అనుమతులు తీసుకోలేదన్నారు. పైగా బైపాస్‌లో జండా కట్ట నిర్మించిన ప్రదేశంలో గతంలో మాదిరిగా బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం పెట్టాల్సి ఉందని కట్టను తొలగించాలని ఎంఆర్‌పీఎస్ వినతిపత్రం ఇచ్చిందన్నారు. ఇక కవితా హోటల్ కూడలిలో అయితే రోడ్డు పక్కన జండా కట్టవల్ల ఆక్రమణలు పెరిగే అవకాశం ఉన్నందున తొలగించడం జరిగిందని ఆయన వివరించారు.

# కోర్టు కేసుల్లో కాలయాపన చేయవద్దు

**- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**పుట్టపర్తి, ఏప్రిల్ 04, ప్రభాతవార్త**

అధికారులు కోర్టులో ఉన్న కేసులకు సంబంధించి వెంటనే కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేయాలని, కాలయాపన వల్ల కోర్టు ధిక్కరణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ హెచ్చరించారు. కలెక్టరేట్ లోని వీడియో కన్ఫారెన్స్ హాలు నందు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కోర్టు ధిక్కరణ కేసులు, ఇతర రిట్ పిటిషన్లపై కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా భూసేకరణ, పట్టా మార్పిడి, ఇతర రెవెన్యూ సంబంధిత సమస్యలపై ఉన్న కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని తహాశీల్దార్లకు సూచించారు. కోర్టు ఇచ్చిన గడువులోగా నివేదికలను సమర్పించాలని, ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. ఆర్.డి.ఓలు తమ పరిధిలోని తహాశీల్దార్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ కేసుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. న్యాయపరమైన అంశాల్లో అలసత్వం వహిస్తే వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందనీ, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి తగిన ఆధారాలతో కోర్టుకు నివేదించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, ఆర్.డి.ఓలు, తహాశీల్దార్లు వివిధ శాఖల అధికారులు ,జిల్లా రెవెన్యూ యంత్రాంగం, ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ నాయుడును పదవి నుంచి తప్పించాలి..!

**- తిరుమల లడ్డూ పవిత్రపై వివాదం సృష్టించారు**

**- మాజి ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి - చిన్మయానగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**



గుడిలో పూజలు చేస్తున్న దృశ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**రాప్తాడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త**

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సద్గుణాలు, సకల గుణాలను బయట పడినా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు. వెంటనే టీటీడీ చైర్మన్ పదవి నుంచి ఆయనను తొలగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ రాప్తాడు మాజి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాప్తాడు మండలం చిన్మయానగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్య నాయకులు పూజలు చేశారు. అనంతరం తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ..గత రెండేళ్లుగా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మతాన్ని, దేవుడిని రాజకీయాల్లోకి తీసుకొస్తున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను ప్రశ్నార్థకంగా మార్చారు.

**లడ్డూ వివాదం-నివేదికలున్నా ఆరోపణలు :**

లడ్డూ తయారీలో ఎలాంటి కల్తీ జరగలేదని దర్యాప్తు సంస్థలు నివేదికలు ఇచ్చినా కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు బాత్రూం యాసిడ్, జంతువుల కొవ్వు కలిసిందని మాట్లాడడం సిగ్గుచేటు. హిందూ సమాజం ఈ విధానాన్ని గమనిస్తోంది.

**టీటీడీ చైర్మన్‌పై చర్యలు ఎందుకు లేవు..?**

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి వ్యవహారంపై అన్ని విషయాలు బయటపడినా కూడా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. వెంటనే ఆయనను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్‌పై ప్రశ్నలు తాను సనాతన ధర్మాన్ని పాటిస్తున్నానని చెప్పుకునే రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, టీటీడీపై అపచారం జరిగినా స్పందించకపోవడం విచారకరం అన్నారు. ముఖ్యమంత్రి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం అవినీతిలో మునిగిపోయిందని, ఏబీ వెంకటేశ్వరరావు, శివాజీ, కొలికపూడి శ్రీనివాసరావు వంటి వారు కూడా బహిరంగంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

**అమరావతి నిర్మాణాల్లో భారీ వ్యత్యాసాలు :**

రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో చదరపు అడుగు రూ.2వేలకే నిర్మాణాలు జరుగుతుండగా, అమరావతిలో మాత్రం రూ.12వేలకు పనులు అప్పగించడం ప్రజాధనం దుర్వినియోగానికి నిదర్శనం అన్నారు. 13 జిల్లాల సంపదను అమరావతికి మళ్లిస్తున్నారని విమర్శించారు. ప్రజల్లో అసంతృప్తి-హామీలు నెరవేరలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని, రైతులు, మహిళలు, నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్థలను తమ ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోండి ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకుని బీఆర్ నాయుడును పదవి నుంచి తొలగించి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలు గద్దెదించే రోజులు వస్తాయని హెచ్చరించారు.

# పాలీసెట్-2026 దరఖాస్తుల గడువు 9వ తేదీ వరకు పొడిగింపు

**4వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ప్రారంభం**

**కళ్యాణదుర్గం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**

పాలీసెట్-2026 ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ముందు గా ఈనెల 4వ తేదీతో ముగియాల్సిన దరఖాస్తుల గడువును ఈనెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు కళ్యాణదుర్గం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ తిప్పేస్వామి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పాలీసెట్-2026 పరీక్షలు ఈనెల 25వ తేదీన జరగనున్నాయని ఆయన వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మెరుగైన సన్నద్ధత కల్పించేందుకు బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పొందాలని, పాలీసెట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు.

# చీనీ రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

**-రైతు సంఘాలు సమావేశంలో మార్కెయార్డ్ చైర్మన్ బల్లా పల్లవి**



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ బల్లా పల్లవి , హాజరైన రైతు సంఘాల నాయకులు

**అనంతపురం మార్చి04 ప్రభాతవార్త**

చీనీ రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తానని రైతు సంఘాల సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ బల్లా పల్లవి పేర్కొంది. శనివారం మార్కెట్ యార్డులో పండ్లతోటల రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన జాయింట్ కమిటి సమావేశంలో మార్కెటింగ్ ఏడిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన వినతి పత్రం మేరకు ప్రధానంగా కమిషన్ నాలుగుశాతం కంప్యూటర్ బిల్లు ఇచ్చేలా, డిసే ్ణ బోర్డు ఏర్పాటు, ఇనామ్ రద్దుతో పాటు ఇతర డిమాండ్లను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని చైర్మన్ హామీఇచ్చారు. పెట్రో, డీజిల్‌ధరలుపెరగడం, ఎరువులు, మందుల ధరలు పెంచేశారని, చీడపురుగులు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనిపండిస్తున్న పంటలకు గిట్టుబాటుధరలు కల్పించకపోవడం, దళారులతో మోసపోవడంవల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురౌతూ అప్పులు పాలౌతున్నారని రైతులుఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా చీనీమార్కెట్ యార్డులో ఈనామ్ వ్యవస్థ రద్దుచేసి వేలంపాటద్వారా కొనుగోలు చేయాలని, చీనీ తోటలల్లో సూట్ తీసుకునే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, పెరుగుతున్న పండ్ల తోటలకు అనుగుణంగా షెడ్లు నిర్మాణాలు, కోల్డ్ స్టోరేజ్‌లు, చీనీప్రాసెసింగ్ యూనిట్లు, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని, మార్కెట్‌లో ప్రతి రైతుకు కంప్యూటర్ ద్వారా చీని అమ్మకాల బిల్లులు ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్లను తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, అధ్యక్షులు బి.హెచ్.రాయుడు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, ఎం.కె.వెంకటరెడ్డి, ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, నాగలింగారెడ్డి, సంగప్ప, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బి.ఆర్. నాయుడును టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలి

**మాజీ ఎంపీ తలారి రంగయ్య డిమాండ్**



శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయ ప్రాంగణంలో నిరసన ప్లే కార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, మార్చి 4 ప్రభాతవార్త**

తిరుమల పవిత్రతను పరిరక్షించాలని, వివాదాస్పద వ్యక్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బి.ఆర్. నాయుడును వెంటనే టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని వైఎస్సార్సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కళ్యాణదుర్గంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈకార్యక్రమానికి మాజీఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య నాయకత్వం వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ, కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం అయిన శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పవిత్ర మైన టీటీడీ ఛైర్మన్ పదవిలో బి.ఆర్. నాయుడు వంటి వ్యక్తులు కొనసాగడం ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. స్వామివారి పవిత్రత విషయంలో వైఎస్సార్సీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి. తిప్పేస్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొడగట్ట నారాయణ, మూలకనూరు తిమ్మరాయుడు, వివిధ మండలాల కన్వీనర్లు, ఎంపీపీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'రుద్రా ఇన్‌ఫ్రా' ఫోర్జరీ కాంట్రాక్ట్ సంస్థపై చర్యలు తీసుకోండి

**-సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్**



కమిషనర్ జస్వంత రావుతో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

**అనంతపురం మార్చి04 ప్రభాతవార్త**

'రుద్రా ఇన్‌ఫ్రా' ఫోర్జరీ కాంట్రాక్ట్ సంస్థపై తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జస్వంత రావును డిమాండ్ చేశారు. శనివారం ఆయనతో పాటు పార్టీ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి బి.రమణయ్య, కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, సంతోష్‌కుమార్, చాంద్‌బాష,నాగప్ప తదితరులు కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ రుద్రా ఇన్‌ఫ్రా కాంట్రాక్టు సంస్థ బోగస్ రిజిస్ట్రేషన్‌తో చేపట్టిన పనులపై తీవ్ర అనుమానాలు వ్యక్తమౌతున్నాయని, ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్నతాధికారుల బోగస్ సంతకాలతో ఏర్పాటై టెండర్లు వేసి పనులు చేపట్టడం ఎంతో మోసపూరితమన్నారు. ఇలాంటి సంస్థపై ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. ఈ సంస్థపై ఇప్పటివరకు సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోందని తక్షణం చర్యలు చేపట్టాలని లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# శ్రీ బాలాజీ పీజీ కాలేజ్ ఎంబీఏలో ప్రాంగణ నియామకాలు.. 23 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో కళాశాల, కంపెనీ ప్రతినిధులు

**అనంతపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త బ్యూరో**

శ్రీ బాలాజీ పీజీ కాలేజ్ ఎంబీఏ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థుల కోసం ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టిఎస్ఐ సాఫ్ట్‌వేర్ కంపెనీ నియామకాలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ డ్రైవ్‌లో 2026లో ఎంబీఏ పూర్తి చేసుకునే దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బిజినెస్ అసోసియేట్, బిజినెస్ అనలిస్ట్ పోస్టుల కోసం ఎంపికలు చేపట్టారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికంగా రూ.3,50,000 వేతనం ఆఫర్ చేసినట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా గ్రూప్ డిస్కషన్, ఆన్‌లైన్ పరీక్ష, హెచ్‌ఆర్ రౌండ్లు నిర్వహించగా 23 మంది ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు హెచ్‌ఆర్ మేనేజర్లు నిర్మల, రఘు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యమని, ఇలాంటి ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు వారికి మంచి అవకాశాలను అందిస్తాయని" తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కిషోర్ పల్లె ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, మే 1 నుంచి వారు ఉద్యోగాల్లో చేరనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.